క్లుప్తంగా

60 మంది విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారాంపురం సైన్స్ వ్యవసాయ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు, లయన్స్ క్లబ్ అరసవల్లి అధ్యక్షుడు హారికాప్రసాద్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏజీ బీఎస్సీ విద్యార్థులు 60 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ మోహన్‌ను రెడ్‌క్రాస్ ప్రతినిధులు ప్రత్యేకంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. రక్తదానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అర్హులైన యువత రక్తదానానికి ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో హర్షవర్ధన్, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్య, రెడ్ క్రాస్ ప్రతినిధి సతీష్ పాల్గొన్నారు.

సక్రమంగా సామాజిక తనిఖీలు



మాట్లాడుతున్న వెంకటరమణ

జి.సిగడాం: ఉపాధి హామీ పథకం పనులపై చేపట్టే సామాజిక తనిఖీలను సక్రమంగా చేపట్టాలని ఎస్ఆర్‌పీ ఎస్.వెంకటరమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన సచివాలయాలు, ఆర్‌బీకేలతో పాటు ఇతర పనులపై తనిఖీ చేయాలన్నారు. ఎంపీడీవో కె.కృష్ణంరాజు, ఏపీవో చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు ఉన్నారు.

చౌదరి కుటుంబానికి పరామర్శ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

గార: కొర్ని గ్రామానికి చెందిన విశ్రాంత వీఆర్‌వో, ప్రముఖ రంగస్థల కళాకారుడు చౌదరి మన్మధరావు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు గురువారం పరామర్శించారు. కుమారుడు, రామచంద్రాపురం వీఆర్‌వో చౌదరి చక్రవర్తితో మాట్లాడారు. అదేవిధంగా కుమ్మరిపేటకు చెందిన మళ్ల జగదానంద స్వామి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కన్వీనర్ పీస గోపి, ముంజేటి కృష్ణమూర్తి, సర్పంచ్ మార్పు పృథ్వీరాజ్, పద్మారావు, మన్మధరావు పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజానికి కృషి



రోగిని తనిఖీ చేస్తున్న రవీంద్రకుమార్

జి.సిగడాం: కుష్టు రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కుష్టువ్యాధి నిర్మూలన అధికారి రవీంద్రకుమార్ అన్నారు. గురువారం ఆనందపురం గ్రామంలో పర్యటించి వ్యాధిపై అవగాహన కల్పించారు. వ్యాధి గుర్తించడానికి ప్రత్యేక వైద్య బృందాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పేడాడ సత్తిరాజు, పంచాయతీ కార్యదర్శి పైల జయరాం, ఏఎన్ఎంలు ఎండమూరి నాగమణి, పద్మ, చిన్ని, కార్యకర్తలు ఉన్నారు.

ఎస్‌డీసీల డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల డైరీని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ గురువారం డైరీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ, ఎస్‌డీసీలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎచ్చెర్ల క్యాంపస్: బడివానిపేట 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు శుక్రవారం చేపడుతున్నారు. దీంతో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ డీఈ బయ్యన్నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొయ్యాం, నిమ్మవానిపేట, బడివానిపేట ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆనంద రాగం..!



గీతాలు ఆలపిస్తున్న ఆనంద్ (ఫైల్)

- స్వరమాధురి పేరిట దేశవిదేశాలలో ప్రదర్శనలు
- అరసవల్లి ఆదిత్యునికి ఏకాంత సేవ రూపకం
- నేడు గేదెల ఆనంద్ జయంతి



అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఏకాంతసేవ ఆలపిస్తున్న జి.ఆనంద్ బృందం(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: తన మధురమైన గాత్రంతో దేశ విదేశాలలో పాటలు పాడి మంచి గాయకుడిగా పేరుగాంచారు దివంగత గేదెల ఆనంద్. హిరమండలంలోని తులగాం గ్రామానికి చెందిన ఈయన కళా ప్రవీణ బండారు చిట్టిబాబు ఆర్కెస్ట్రాలో అనేక గీతాలు ఆలపించి శ్రోతల హృదయాలు గెలుచుకున్నారు. గాయకునిగా చేర్చుకున్నారు. ఈ ఆర్కెస్ట్రా ద్వారా రాష్ట్రంలో పలు ప్రాంతాలలో ప్రదర్శనలు ఇచ్చేవారు. స్వరమాధురి ఆర్కెస్ట్రా ద్వారా దేశ విదేశాలలో 8500 ప్రదర్శనలు ఇచ్చారు. 300 సినిమాలకు పాటలు పాడారు. 350 భక్తిగీతాలను ఆలపించారు. ఈయనకు సుసర్ల దక్షిణామూర్తి సంగీత పురస్కారాల సభలో సంగీత కళా మణిరత్న బిరుదు ప్రదానం చేశారు. ఘంటసాల పురస్కార ప్రదానోత్సవంలో ప్రముఖ గాయని ఎల్ఆర్ ఈశ్వరితో కలిసి ఆనంద్ గీతాలను ఆలపించారు. తన 67వ ఏట కరోనాతో పరమపదించారు.

ప్రత్యేకంగా 'ఏకాంత సేవ'..

అరసవల్లి సూర్యనారాయణ స్వామికి సుమారు 500 ఏళ్లగా ఏకాంత సేవ నిర్వహిస్తున్నారు. తొలుత దేవదాశీ వ్యవస్థ ద్వారా ఈ సేవ నిర్వహించినా తర్వాత రద్దు కావడంతో అర్చకులు నిర్వహించే వారు. అప్పట్లో భాస్కరభట్ల సీతారామాచార్యులు ఏకాంత సేవ గీతాన్ని రచించారు. ఇంత ప్రాముఖ్యత గల ఏకాంత సేవను తిరిగి ఎలాగైనా కొనసాగించాలనే పట్టుదలతో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి జోగారావు, టి.వి.శివరావుల కృషితో ఆ పాటను రూపకంగా తిర్చిదిద్దారు. ఇందులో దూసిబె నర్జీ, బండారు చిట్టిబాబు, జి.ఆనంద్‌లు కీలక పాత్రపోషించారు. అప్పట్లో ఈ ఏకాంత సేవ గీతాన్ని జి.ఆనంద్, ఎస్.జానకిలు గానం చేసి క్యాసెట్లను సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆనంద్ సినీ గాయకుడిగానూ, ఐదు సినిమాలకు సంగీత దర్శకుడిగా, సీరియల్స్‌కు డబ్బింగ్ ఆర్టిస్టుగానూ సేవలందించారు.

నేడు సూర్యనమస్కారాల నిర్వహణ

శ్రీకాకుళం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 16న రథసప్తమి సందర్భంగా సామూహిక సూర్యనమస్కారాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ ఎం.లలితామణి ఒక ప్రకటనలో తెలిపారు. పీఎన్ కాలనీలోని సాయివిద్యామందిర్ విద్యార్థులతో ప్రదర్శన, ఆదిత్య హృదయ స్తోత్ర పారాయణం నిర్వహించి క్షీరాన్న ప్రసాదంపంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

కథా నిలయం సందర్శన



కథానిలయంలో తెలుగు వెలుగు సాహిత్యవేదిక సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు వెలుగు సాహిత్య వేదిక ప్రతినిధులు కథానిలయంను గురువారం సందర్శించి కారా మాస్టారు తనయులు కాళీపట్నం సుబ్బారావును కలసి కథానిలయం విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు వెలుగు సాహిత్య వేదిక ప్రధాన కార్యదర్శి మోటూరి నారాయణరావు మాట్లాడుతు కథానిలయం, కారాపై ఒక సంకలనం తీసుకువచ్చిందని అన్నారు. సమావేశంలో సుబ్బారావు మాట్లాడుతూ కథానిలయం వార్షికోత్సవాలు ఇకపై రెండు తెలుగు రాష్ట్రాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 24న హైదరాబాద్‌లో కథానిలయం వార్షికోత్సవం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు భాషా దినోత్సవం పోస్టర్‌ను తెలుగు సహిత్య వేదిక ప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఇస్రో శాస్త్రవేత్త డబ్బీరు వెంకటశరత్‌కవి, జె.వి.కుమార్, అరవల రవీంద్రబాబు, వినోద్, బి.ఉమామహేశ్వరరావు, కథానిలయం కార్యదర్శి దాసరి రామచంద్రరావు పాల్గొన్నారు.

అదనపు భవనానికి శంకుస్థాపన



పనులకు భూమిపూజ చేస్తున్న కిరణ్‌కుమార్

రణస్థలం: పాతర్లపల్లి పంచాయతీ సూరంపేటలో కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రం న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సీఎస్‌ఆర్ నిధులు రూ. 16 లక్షల వ్యయంతో ఎంపీపీ పాఠశాలలో నిర్మించతలపెట్టిన అదనపు భవనం పనులకు ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జేసీఎస్ ఇన్‌చార్జి చిల్ల వెంకటరెడ్డి, పాతర్లపల్లి సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, నాయకులు మహంతయ్య, లోలుగు క్రిష్ణ, ముఠామేస్త్రి, జగ్గురోతు అప్పలనాయుడు, రామకృష్ణ, శ్రీరాములు, రమణ, అసిరినాయుడు ఉన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు కేజీబీవీ విద్యార్థిని ఎంపిక



ఇందుకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న డీఈవో వెంకటేశ్వరరావు

జి.సిగడాం: స్థానిక కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని ఎస్.ఇందు రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఉషారత్నకుమారి గురువారం తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన ప్రయోగాల్లో ఇందు మంచి ప్రతిభ కనబర్చింది. ఈమెకు డీఈవో వెంకటేశ్వరరావు ప్రశంసా పత్రాన్ని అందించి అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న జేఏసీ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర జేఏసీ (ఎన్జీవో) ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, కిషోర్, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

యునైటెడ్ కార్మికుల దాతృత్వం



నారాయణమ్మకు సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

రణస్థలం: మండలంలోని యునైటెడ్ బ్రూవరీస్ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికుడు ఎస్.మాలచ్చి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. స్పందించిన తోటి కార్మికులంతా యునైటెడ్ బ్రూవరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఒక రోజు వేతనం రూ. 2,40,105 విరాళంగా సేకరించారు. ఈ మొత్తాన్ని మృతుని భార్య నారాయణమ్మకు గురువారం పరిశ్రమ వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ అమ్మన్నాయుడు చేతుల మీదుగా అందజేశారు. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.నారాయణరావు, జె.గంగరాజు, సభ్యుడు పి.సత్యనారాయణ ఉన్నారు.

గ్రామాల స్వరూపం మారింది



గుంటుకుపేటలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ చంద్రశేఖర్, ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- విజయనగరం ఎంపీ చంద్రశేఖర్, ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: ప్రభుత్వ కార్యాలయాల భవనాల నిర్మాణాలతో గ్రామాల స్వరూపం మారిందని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. లావేరు మండలం చిన్నమురపాక, మురపాక–2 సచివాలయం పరిధి గుంటుకుపేట గ్రామాల్లో సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్‌హెల్త్ క్లినిక్ భవనాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజీనాయుడు, జేసీఎస్ ఇన్‌చారిజ మీసాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, నాయకులు చాంద్‌బాష, తవిటినాయుడు, విజయలక్ష్మి, రమేష్‌బాబు, సిరిపురపు రాంబాబు, కొన్ని సత్యం, పెయ్యల లక్ష్మణరావు, కలిశెట్టి భాస్కరావు, తేనెల విద్యాసాగర్, జల్లేపల్లి జనార్ధనరావు, కొన్ని గోపి, కూరపు పోలీసు, లావేరు ఎంపీడీవో జి.భాస్కరరావు, డీఈ సీతంనాయుడు, జేఈ అప్పన్న, ఏవో మహేష్‌నాయుడు ఉన్నారు.

షిర్డీసాయికి పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఇలిసిపురం, ద్వారాకానగర్‌లోని షిరిడీసాయి బాబా సేవా సంస్థాన్ మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



పనులు నిర్వహిస్తున్న దృశ్యం

గార: రామచంద్రాపురం పంచాయతీ జొన్నలపాడు కాలనీలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి, కార్యదర్శి ఎం.రాంబాబుల పర్యవేక్షణలో సిబ్బంది సీసీ రోడ్లు, డ్రెయిన్లను శుభ్రం చేశారు. చెత్తా చెదారం వేయకుండా సహకరించాలని, తాగునీరు వృథా చేయవద్దని సర్పంచ్ కోరారు.

ఎస్‌బీఐలో శాలరీ ఖాతా ఉంటే ఉచిత బీమా వర్తింపు

నరసన్నపేట: స్టేట్‌బ్యాంక్‌లో జీతాల ఖాతా ఉన్న ఖాతాదారులు తమ ఖాతాను శాలరీ ప్యాకేజీ అకౌంట్లోకి మార్చుకొంటే ఉచిత బీమాతో పాటు మరిన్ని సౌకర్యాలు పొందవచ్చని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ టీఆర్‌ఎం రాజు తెలిపారు. సారవకోట మండలం అంగూరుకు చెందిన సీఆర్‌పీఎఫ్ ఉద్యోగి లింగిబేరి రవి ప్రమాదంలో మరణించగా ఆయన నామినీకి ఎస్‌బీఐ ఇన్స్యూరెన్స్ నుంచి రూ. 50 లక్షలు బీమా చెల్లించామని తెలిపారు. ఈ మేరకు చెక్కును రవి భార్య రోహిణికి గురువారం ఇచ్చామని అన్నారు. నరసన్నపేట చీఫ్ మేనేజర్ రుప్ప సురేష్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సరుబుజ్జిలి: మండలంలోని తెలికిపెంట, పాతపాడు, అగ్రహారం, చినకాగితాపల్లి, రొట్టవలస గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జె.రమేష్‌బాబు గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులకు సంబంధించిన ర్యాంపులు, ఇతరత్రా సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పోలింగ్‌కు ముందు రోజు కేంద్రాలకు చేరుకునే సిబ్బంది ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. పరిశీలనలో ఆర్ఐ బాబూరావు, వీఆర్వోలు, బీఎల్వోలు, పంచాయితీ కార్యదర్శులు ఉన్నారు.

కొరసవాడ విద్యార్థుల ప్రతిభ

పాతపట్నం: టెక్కలిలో జరిగిన జోన్–2 స్కూల్ లెవెల్ గ్రిగ్స్ పోటీల్లో కొరసవాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని హెచ్‌ఎం బి.సింహాచలం చెప్పారు. విజేతలను పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కబడ్డీ, షాట్‌పుట్, 300, 1500 మీటర్ల రన్నింగ్, ట్రిబుల్, లాంగ్, హైజంప్ విభాగాల్లో 17 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అలాగే పెద్దసీది జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆల్‌రౌండర్ చాంపియన్‌గా నిలిచారని పీడీ సిమ్మ కృష్ణారావు తెలిపారు. విజేతలను హెచ్‌ఎం బి.రామమూర్తి, మధుసూదనరావు, ఉపాధ్యాయులు అభినందించారు. పీఈటీ జె.కృష్ణ, మహాలక్ష్మి, ఎం.రామారావు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో చక్రతీర్థ స్నానాలు

సారవకోట: మండలంలోని కిన్నెరవాడ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చక్రతీర్థ స్నానాలు గురువారం భక్తిశ్రద్ధలతో వంశధార ఎడమ కాలువలో నిర్వహించారు. ఈ ఆలయంలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ఈ చక్రతీర్థ స్నానాలు నిర్వహించినట్లు అర్చకులు కొరపాక సిద్ధయ్య స్వామి తెలిపారు.

ఉపాధ్యాయుల ఉదారత

పోలాకి: మండలంలోని ఉపాధ్యాయులు తమ వద్ద చదువుకుంటున్న విద్యార్థినికి క్యాన్సర్ చికిత్స కోసం ఆర్థిక సాయం చేశారు. ముప్పిడి ప్రాథమిక పాఠశాల విద్యార్థిని గంగు పల్లవి కంటికి సంబంధించిన క్యాన్సర్‌తో బాధ పడుతోంది. ఈ విషయం టీచర్లకు తెలియడంతో మండలంలోని ఉపాధ్యాయులంతా కలసి రూ.94,500 సేకరించి విద్యార్థిని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎంఈఓ టి.లింగరాజు, హెచ్‌ఎం బి.శ్యామలరావు, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరీక్షల సన్నద్ధతపై అవగాహన

సరుబుజ్జిలి: విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చునని శ్రీకాకుళం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దూసి సూర్యవిజయభరద్వాజ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల సన్నద్ధతపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ప్రతిఒక్కరూ సేవా భావం అలవాటు చేసుకోవాలని ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీవో రమేష్‌సాహు, అధ్యాపకులు పాల్గొన్నారు.